# విమానంలో చంద్రలోకానికి ప్రయాణం

అన్నయ్య: కమలా, రాము, మీరిద్దరూ సిద్ధంగా ఉన్నారా! చంద్రలోకానికి వెళ్ళడానికి.

కమల: రాము: ఉన్నాము, అన్నయ్యా.

అన్నయ్య: అదిగో, అక్కడ విమానం ఉంది. అందులోనే మనం వెళ్ళాలి.

కమల: విమానం ఎండలో ఎంతచక్కగా మెరుస్తున్నది.

రాము: అచ్చం వెండిలాగేవుంది.

అన్నయ్య: ఇంక అట్టేసైంలేదు. మనంవెళ్ళి విమానంలో కూర్చుందాం రండి........ ఆఁ, విమానం దగ్గరికి వచ్చేసాం ఇవిగో మెట్లు. రాము ముందునువ్వు జాగ్రత్తగా వెళ్ళికూర్చో. ఎక్కావా. కమలా నీవుకూడాఎక్కు,

కమల: ఆఁ, ఎక్కేసాను. నీవుకూడా ఎక్కుఅన్నయ్యా.

అన్నయ్య: అఁ, విమానంలోకి వచ్చేసాం.

కమల: విమానం చాలాచిన్నది. రెండేసీట్లున్నాయి. నీవు ఎక్కడకూర్చుంటావు అన్నయ్యా.

అన్నయ్య: అదుగో అక్కడకూర్చొని, విమానంనడుపుతాను. విమానం నడువకుండా ఎల్లావెడుతాం. మీరిద్దరు కూర్చున్నారా? శరీరానికి ఆబెల్టులు బిగించుకోండి. ఆఁ, ఇంక విమానం పైకిలేస్తుంది.

రాము: విమానంలో ఎగరడం భలే సరదాగావుంది.

కమల: నాకు చలేస్తున్నది.

అన్నయ్య: చంద్రలోకానికి మోక్షానికి ప్రత్యేకంగా వెచ్చని గుడ్డలు కుట్టించుకున్నామే? ఆ గుడ్డలు వేసుకోండి. భూమినించి అప్పుడే ఒక మైలువచ్చేసాం.

కమల: చంద్రలోకం ఎన్ని మైళ్ళుఉంటుంది అన్నయ్యా?

అన్నయ్య: 2,40,000 మైళ్ళు. భూమినించి మూడు మైళ్ళు వచ్చాం. ఇక్కడినించి మనకు గాలివుండదు. ప్రాణ వాయువు గొట్టాలు, ముక్కుకి తగిలించుకోండి. 50, వంద, వెయ్యి. రెండువేలు, మూడు..........

కమల: మనం చంద్రలోకానికి వెడితే, ముసలిది కనపడుతుందా?

రాము: ఎప్పుడూ రాట్నంవడుకుతూ కూర్చుంటుంది ఎందుకన్నయ్యా?

అన్నయ్య: చంద్రుడిలో ఆనల్లగా కనపడేమచ్చ, ముసలిది రాట్నం వీకులు వడకడం అనుకుంటున్నారు కదూ?

కమల: మరికాక.

అన్నయ్య: చంద్రుడిలో రాట్నంలేదు. ముసలిదీలేదు. పెద్ద పెద్ద పర్వతాలున్నాయి. ఆ పర్వతాలనీడలే చంద్రుడిలోనిమచ్చ.

కమల: మన భూమిపైన ఉన్నట్లే, అక్కడ చెట్లూ, చామలు ఉన్నాయా? మనుషులు ఉన్నారా?

అన్నయ్య: చెట్లు, చేమలు, జంతువులు, మనుషులు ఏమీ ఉండరు.

కమల: మరి ఇంకేమి ఉంటాయి.

అన్నయ్య: పర్వతాలు గుట్టలు తప్ప ఇంక ఏమీ ఉండవు. 2 లక్షల మైళ్ళు వచ్చేసాం. ఇంక మనం వెళ్ళవలసింది 40వేల మైళ్ళే.

రాము: ఇక్కడినించి చంద్రుడు ఎంత చక్కగా కనపడు తున్నాడు.

అన్నయ్య: అవును. ఇవ్వాళ దశమి. అయిదోరోజున అంటే పౌర్ణమినాడు చంద్రుడు మనకు పూర్తిగా కన పడుతాడు. ఈ రోజు కొద్దిగా వెలితుంది. పాడ్యమి నాడు చంద్రవంక చాలా సన్నగా వుంటుంది. పౌర్ణమి నాటికి పూర్ణబింబం కనపడుతుంది. అంటే రోజుకు రోజు చంద్రుడు పెరుగుతాడన్నమాట. దీనినే చంద్రునికళలు అంటారు. చంద్రుడు ఎల్లాపుట్టాడో మీకు తెలుసునా. తెలియకపోతే వినండి, భూమి సూర్యుడిచుట్టూ తిరుగు తున్నది కదూ. ఆ తిరుగుడులో ఒకమాటు భూమిలోంచి ఒక తునుక ఊడిపోయింది. ఆ తునకే చంద్రుడైనాడు.

ఊడిపోయినచోట గొయ్యి ఏర్పడింది. ఆ గొయ్యిలో నీళ్ళుచేరి పసిఫిక్ మహాసముద్రమైంది. మనకు పెద్ద పెద్ద మహాసముద్రాలుంటే, చంద్రుడిలో చివరకు చెరువులుగాని, నదులుగానిలేవు. తాగటానికి నీళ్ళైన దొరకవు. నీళ్ళులేకపోవడంవల్ల, మేఘాలుగాని, వర్షాలుకావి వుండవు. చంద్రుడిలో అనేక అగ్ని పర్వతాలు ఉన్నాయి. ఇవి చాలా కాలంక్రిందటే చల్లారిపోయినాయి. జపాను, ఫిలిప్పైన్సు దేశాల్లోవున్న అగ్నిపర్వతాలలాంటివే యివి.

కమల: గ్రహణంపట్టిందంటారే, అదేమిటి అన్నయ్యా.

అన్నయ్య: చంద్రుడు భూమిచుట్టూ తిరుగుతున్నాడు. 27 రోజుల్లో భూప్రదక్షిణచేస్తాడు. ఈ 27 రోజుల్లో తన చుట్టూతాను ఒకసారి తిరుగుతాడు. భూమేమో సూర్యుడిచుట్టూ తిరుగుతున్నది. ఈ తిరుగుతూ, భూమి, సూర్య చంద్రుల మధ్యకు వచ్చేస్తే, సూర్యుడి వెల్తురుకు భూమి అడ్డంగా వుండడంవల్ల, చంద్రుడుపైన ఆ వెల్తురు పడదు. అప్పుడు చంద్రుడు కనపడడు. దీన్నే మనం చంద్రగ్రహణం అంటాం. కొందరు చంద్రగ్రహణాన్ని చూచి, చంద్రుడిని పాము మింగిందంటారు. అసలు పాములేదు, పాడులేదు. మింగడం ఎక్కడినించి జరుగుతుంది. ఇదిగో మాటల్లోనే చంద్రలోకానికి వచ్చేసాం.

విమానాన్ని చంద్రలోకంలో దించుతాను. మీరు జాగ్రత్తగా కూర్చోండి.

రాము: అమ్మయ్య. చంద్రలోకానికి వచ్చేసాం. ఇంక విమానం దిగేద్దాం.

కమల: అయ్యో. ఇక్కడ వెన్నెలలేదు ఏమీలేదు.

రాము: గాలికూడా ఆడడంలేదు.

అన్నయ్య: చంద్రుడిలో అసలు గాలివుండదు. ఆఁ, ప్రాణవాయువు గొట్టం తీసెయ్యకు.

కమల: అబ్బ. ఇక్కడ ఎండవేడిమి చాలావుంది. ఆ గుట్టనీడలోకి వెడుదాం రండి.

అన్నయ్య: గుట్టనీడలోకి వెళ్ళకండి. అక్కడ చిమ్మన చీకటి. ఒకర్ని ఇంకొకరం కనుక్కోలేము. మన మాటలుకూడా వినిపించవు.

కమల: చీకటిలో కనపడక పోవడమేమిటి?

అన్నయ్య: నీవు భూమిసంగతి మాట్లాడుతున్నావు. అక్కడ గాలివుంది. అక్కడ చీకటిలో ఎందుకు కనపడుతుందంటే, మనచుట్టూ గాలివుండడంవల్ల - గాలిలో ధూళి వుంటుంది. గాలి కణాలపైన, ధూళి కణాలపైన ఎండ పడ్డప్పుడు, అవి చెదిరి, మన ఇంట్లోకి కొంత వెల్తురు వస్తుంది. దానితో మనకు వస్తువులు కనపడుతాయి.

కమల: అదుగో అన్నయ్య, రాము ఎంతపెద్ద గంతువేసాడో చూడు.

అన్నయ్య: రాము భూమిపైన 3పుట్లు దూకగలిగితే, ఇక్కడ 6 యింతలు ఎక్కువ దూకగలుగుతాడు. అంటే 18 పుట్లు దూకగలడన్నమాట. మనిషి భూమిపైన 120 పౌండ్ల బరువు ఉంటే, ఇక్కడ 20 పౌండ్లు మాత్రమే ఉంటాడు. ఇక్కడ పుటుబాల్ తన్నితే ఒక మైలు దూరంలోపడుతుంది. పెద్దరాళ్ళుకూడా కాలితో ఒక తన్నుతన్నితే, ఫర్లాంగుదూరంలో పడుతాయి. ఎందువల్లనో తెలుసునా? చంద్రుడు చాలాచిన్నవాడు. అందువల్ల భూమికన్న ఆకర్షణలో, అతనికి 6వ వంతు మాత్రమేవుంది. గాలి లేక పోవడంవల్ల, ఇక్కడ మాటలుకూడా వినపడవు. కాని మనం అమర్చుకున్న యంత్రాలవల్ల ఒకరిమాటలు ఇంకొకరం వినగలుగుతున్నాం.

కమల: అన్నయ్యా, అన్నయ్యా, అదుగో రాము, గాలిలో ఎగిరిపోతున్నాడు.

అన్నయ్య: రాము, రాము.

కమల: పర్వతంనీడలోకి వెళ్ళాడు. కనపడడంలేదు. అన్నయ్యా, ఇప్పుడెట్లూ, రాముడిని కనుక్కోవడం ఎట్లూ. మనంవెడితే, మనంకూడా అక్కడ మాయమైపోతామేమొ. రాము, రాము, రాము. ఏమి చేతామన్నయ్యా.

అన్నయ్య: కమలా భయపడకు. ఇల్లాంటిది ఏదో జరుగు తుందని నేను మొదటే జాగ్రత్తపడ్డాను. చాలా పొడు గాటి తీగతో మననందరినీ విమానానికి కట్టివుంచాను. ఆ తీగను బట్టిలాగుతే, రాము ఎక్కడున్నా విమానం దగ్గరికివస్తాడు. పద, విమానం దగ్గరికి వెడుదాం. నెమ్మదిగా నడువు. నీవుకూడా గాలిలో ఎగిరిపొయ్యేవు!. ఇదిగో తీగ, మనమిద్దరమూ పట్టిలాగుదాము. ఊఁ, లాగు, తీగ ఒకచోట పోగుచెయ్యి. అదుగోరాము. ఎం డలోకివచ్చేసాడు. ఇంకా కొద్దిగాలాగు.

రాము: అమ్మయ్య నీడలో కన్నుపొడుచుకున్నా కనపడ లేదు, అపరిమిత మైన చలి, ఉక్కిరి బిక్కిరి అయి పోయినాను, అదుగో మనకు ఇంకొక పెద్ద చంద్రుడు కనపడు తున్నాడు. ఎంతచక్కగా వెన్నెల కాస్తున్నది,

అన్నయ్య: అది చంద్రుడు కాదు, మన భూమి,

కమల: చంద్రుడికన్నా మనభూమే ఎంతో అందంగా ఉంది.

అన్నయ్య: ఇక్కడినించి భూమి చంద్రుడిలాగా కనపడు తుంది.

కమల: ఇక్కడ నీళ్ళులేవు, గాలిలేదు, పైగా చాలా ప్రమాద మైన స్థలం

738
శ్రీకాకుళం

రాము: ఇక్కడ నేను ఒక్క నిమిషం కూడా వుండలేను, ఇంక వెడుదాం పదండి.

అన్నయ్య: ఏ విధంగా చూచినా మన భూమే మంచిది. విమానంలో కూర్చోండి ఇంక వెళ్లిపోదాం.